ఈ వారం కథ

# అంతరంగం

హైదరాబాద్ అందమైన నగరం అని నేననుకోను.

టాంక్‌బండ్ మాత్రం అద్భుతంగా వుంటుంది నాకు. అవునుమరి— నాలాంటి ఏకాకికి ఇటువంటి ప్రదేశాలే ఆత్మీయులు, ఆప్తులూను.

ఈ మహానగరంలో నేను ఓ ప్రభుత్వ సంస్థలో ఉద్యోగిని. జీతం నా ఖర్చుకు మించిందనే చెప్పగలను. హార్డ్‌లక్ నెలాఖరు వచ్చేసరికి మరో వంద అప్పుచేయాల్సిన పరిస్థితి వస్తుంది. నాకర్థం కాని విషయం ఇదే. నా అంత జీతంతో మా ఆఫీసులో చాలామంది ఆనందంగా సంసారాలు చేసుకుంటున్నారు. మొన్నటికి మొన్న మా కొలీగ్ తన వెడ్డింగ్ యానివర్శరీ అని స్వీట్స్ కూడా పంచాడు. ఈరోజుల్లో ఇంతకంటే గొప్ప నిర్వచనం ఏం కావాలి ఆనందానికి?

నాకప్పుడు ఒకటే అనిపించింది. నాకు బతకడం చేతకాదని, జీవించడం మాత్రం అద్భుతంగా వచ్చునీ బతకటమంటే రేపటిగూర్చి చక్కగా ఆలోచిస్తూ ఇందిరావికాస్ పత్రాలూ, భార్య పోపు డబ్బాల్లో కూడేసిన డబ్బుతో మిక్సీకొని ఆ ఆనందాన్ని సినిమాతో పాలుపంచుకోవడాలూ, బస్ ఎంత రష్‌గాఉన్నా భార్య పిల్లలతో బస్‌లోనే వెళ్తూ, ఆటో వేపయినా చూడకపోవడం ఇంకా చెప్పుకుంటూపోతే చాలా వుంటాయి. ఇదీ నా దృష్టిలో బతుకంటే.

ఇక జీవించడం అంటారా ఇదిగో నేను ఇప్పుడున్న పరిస్థితే నాకున్న ఊహలకూ వర్తమానానికి లంగరందక అనవసరమైన కసితో రోజులు గడపడం.

నాకు ఈ మనుషులన్నా, ఈ పరిస్థితులన్నా చిరాకు, నాకు వీరందరిలో నటన తప్పితే మరోటి కనిపించదు. ఎందుకు వీరంతా హిపోక్రాట్స్‌గా మారుతున్నారు? ప్రతి వెధవా ఎదటి వెధవని డామినేట్ చేయాలన్న తపన. తన పెళ్లానికి రాత్రంతా తలనొప్పివస్తే తను ఎలా కంగారుపడిందీ చెప్తూ, వారి అన్యోన్యదాంపత్యాన్ని ఇతరులు విన్నా వినకపోయినా చెప్పుకుపోవడం, ఇదిగో ఇటువంటి వారంతా నాకు శత్రువులే— వీరిలో స్పందనవుండదు. డెలికసీ అన్నది సెర్చ్‌లైట్ పెట్టి వెదికినా కనిపించదు.

ఆఫీస్ కెళ్లేదాకా అనీజీగా ఉంటుంది. ఈ ఒంటరితనానికి కొంచెం రిలాక్షేషన్ అనే ఆశతో వెళ్తాను. అది భ్రమని నాకు తెలుసు.




అయినా ఈ రాజన్నా ఆ వాతావరణంలో మార్పొస్తుందన్నదే ఆఫ్ హోప్— తీరా ఆఫీస్‌కెళ్లగానే అక్కడ వారందర్నీ చూడగానే జాలీ, కోపం, అసూయ కలుగుతాయ్. సాయంత్రానికి మందుకొట్టాలనే నియమం పెట్టుకున్న నా మిత్రుడు ఉదయం నుండి అప్పుల కోసం వేట— ఆ 'వేట' నేపథ్యంలో అతని ప్రవర్తన విచిత్రంగా ఉంటుంది. అతను ఆ 'అప్పు' కోసం పడే తపన చూస్తే చెప్పొద్దు ముచ్చటేస్తుంది. ఆ తపన చదువులో వుంటే తప్పకుండా ఏ ఐఏఎస్ ఆఫీసరో అయ్యుండేవాడే— ఈ గందరగోళం గజిబిజినంతా డైజెస్ట్ చేసుకోవడానికి నాకు ఈ జీవితకాలం సరిపోదనిపిస్తోంది.

ఇటువంటి, ఆఫీస్‌లో పని చేసే నేను ఎలా మనశ్శాంతిగా ఉండగలను. అందుకే నాకు ఈ టాంక్‌బండ్ అంటే చాలా ఇష్టం.

రెయిలింగ్‌కి ఆనుకుని నీళ్లవైపు చూడడం నాకు సరదా కాదు ఆత్మవంచన. ట్రాఫిక్ వైపు చూస్తే నా ఊహలను వాస్తవాల్ని చేసుకుంటూ హాయిగా తిరిగే జనాలు నాకు కనిపిస్తారు. అది నేను భరించలేను. నా చేత కానితనమో అసమర్థతో నాకు ప్రస్ఫుటంగా తెలుస్తుంది ఆ క్షణాన. ఏ మనిషీ తన అసమర్థతనీ తనుగా అంగీకరించడు. ఎవరైనా చెప్పినా కాదని వాదిస్తాడే తప్ప అవుననడు. నేను మహాత్ముడిని కాను కనుక నాకూ సేమ్ ఫీలింగ్.

వీరంతా ఇంత ఆనందంగా ఎలా ఉండగలుగుతున్నారన్నదే నాకు అర్థంకాని ప్రశ్న. నేను చాలా సార్లు ప్రయత్నించాను. కానీ నా వల్ల కాలేదు. నా నవ్వు మధ్యలో హఠాత్తుగా నేను జ్ఞాపకం వస్తాను.

అంతా మళ్లీ డిప్రెషన్!

ఏదో వెరితి. నా గుండె గూడు నివాస యోగ్యం కాదు. అదో పాడుబడిన బూత్‌బంగ్లా పూర్వ వైభవ చిహ్నాలేతప్ప వర్తమాన విశేషాలేం వుండవు అవశేషాలు తప్ప. ఆ గుండె గదిలోని బూజు మెదడుదాకా పాకి అంతా గజిబిజిగా జిగురుగా గందరగోళంగా.

ప్రభూ నన్ను తీసుకో అని దేవుణ్ని ప్రార్థిస్తాను.

బార్ యజమాని ప్రార్థనలువిని లాభాలు తెచ్చి పెట్టే భగవంతుళ్లున్నారే తప్ప నా మొర ఆలకించేదెవరు ఈ నాటి దేవుళ్లలో.

టైం చూసుకున్నాను. తొమ్మిదీ నలభై! మెన్‌లన్నీ మూసేసి ఉంటారు అనుకుంటూ రోడ్ క్రాస్ చేసి ఇరానీ కేఫ్‌లో కారా బిస్కెట్లు తిని టీ తాగాను.

జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించుకుని రూంకి బయల్దేరాను.

## కలల వాయుగుండమై ఆలోచనల అలలు మనసుమీద విరుచుకుపడిన చప్పుడు!

మళ్లీ రేపు రొటీన్— హిపోక్రాట్స్ నడుమ క్రాష్... ట్రాష్.. క్లాష్.. నాలో క్షణ క్షణానికి అసహనం పెరుగుతోంది. నాకో బలహీనత ఉంది. కసీ, కోపం ఎక్కువైతే చలి బాగా వేస్తుంది. పళ్లు టకటకమంటూ కొట్టుకుంటున్నాయి. చేతులు వణుకుతున్నాయ్. కాళ్లు తడబడుతున్నాయి. కళ్లవెంట నీళ్లు చలెక్కువై.

రోడ్డుమీద నడుస్తున్నాను.

నాకెందుకో క్షణంపాటు అమ్మ గుర్తొచ్చింది.

ఊళ్ళో నన్నే తలుచుకుంటూ పడుకుని ఉంటుందనుకున్నాను

బషీర్‌బాగ్ చౌరస్తా నుండి నిజాం కాలేజి వైపు వెళ్తున్నాను. చలి ఎక్కువైందే తప్ప తగ్గలేదు. ఎదురుగా కళ్లలో ఏదో వెహికిల్ హెడ్ లైట్స్ పడ్డాయి. ముఖానికి చేయిఅడ్డుపెట్టి కిందికి చూశాను. గాడ్ క్షణముంటే డ్రైనేజ్ మాన్‌హోల్‌లో పడేవాడినే. ఎగిరి పక్కకు దూకా.

ఆ దూకటమే నాకు ఈ హిపోక్రాటిక్ సొసైటీ నుండి ఆఖరి క్షణమని తెలీదు. వెనుకనుండి ఏదో బలంగా నా తలకు తగలడం. మరి కాసేపటికి కీచుమంటూ ఆగటం మాత్రం గుర్తుంది.

ఏవో సిల్కు తెరలు.. దారాలు.

రంగులు.. విశ్లేషిస్తూ, నన్నాహ్వానిస్తూ... వెళ్లిపోతున్నాను. ఇక ఈ వెధవ ప్రపంచంనుండి నాకు గొప్ప రిలీఫ్... అబ్బ.. కిత్‌నా పసంద్ హైనా.. హోయ్ నాకు హిందీ వచ్చేసింది. అవునూ.. ఇక ఈ విశాలశూన్యం (?)లో నేనొక్కడ్నే. ఇక్కడ నటనకు స్థానముండదు. యు...రే...కా..అబ్బా.. అన్నట్టు.. ఆత్మలుంటాయంటారు.. ఏవీ కనపడవే..

ఆ మనుషుల్ని మభ్యపెట్టే ప్రచారాలవి అనుకుంటూ.. తెలీని లోకంలో ఆనందంగా స్వేచ్ఛగా విహరిస్తున్న నాకు... ఓ కేక ఓ అస్పష్టమైన ఆకారం.. బూజుగా... పొగలా వచ్చింది... పలకరించింది.

"హలో... సూరీ.. ఏమిటీ ఇంత తొందరగా వచ్చేశావ్... నేనూ మీ ఆఫీసులో పనిచేసి రైలు యాక్సిడెంట్‌లో పోయిన ఎల్డీసీ శర్మను"

ఎందుకో— నాకు తెలీని నా ఆకారం కుంచించుకుపోతున్నట్టూ.. వెనక్కు వెనక్కు వెళ్తున్నట్టు అనిపించింది.

○

రవి కొలికపూడి